క్లుప్తంగా

విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు



బాపులపాడులో రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: గడిచిన నాలుగున్నర ఏళ్లలో విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని బాపులపాడు సర్పంచ్ సరిపల్లి కమలాబాయి చెప్పారు. స్థానిక ఇందిరానగర్‌లోని గ్రామ సచివాలయం–2 ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని సర్పంచ్ కమలాబాయి ప్రారంభించారు. ప్రజలందరూ ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని, ప్రతి ఒక్కరికీ మెరుగైన నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టారని ఆమె అన్నారు. బాపులపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూష నేతృత్వంలోని వైద్యుల బృందం 731 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జయరాజు, బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, ఎంపీటీసీ నూకల జ్యోతి, పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా వైఎస్సార్ సీపీ



కంకిపాడు: ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా వైఎస్సార్‌సీపీ నిలుస్తుందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండవీటి వెంకట సుబ్బారావు అన్నారు. మంతెన గ్రామానికి చెందిన ఉప్పలూరి భూలక్ష్మి కుటుంబం అనారోగ్యంతో ఇబ్బందులు పడటంతో కుటుంబానికి తన వంతు సాయంగా కొండవీటి వెంకట సుబ్బారావు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం బాసటగా నిలుస్తుందన్నారు. రాజకీయాలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమన్నారు. సంక్షేమ లబ్ధి పొందుతున్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి, వైఎస్సార్‌సీపీకి బాసటగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొండేటి వెంకటేశ్వరరావు, మేడంకి బాబీ, వీరంకి గంగాధర్‌రావు, కొండవీటి శ్రీనివాసరావు, మాదు శ్రీనివాసరావు, గోగం ఆదినారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: పోరంకి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు అవటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం గంగూరుకు చెందిన గంపా సత్యవేణు మాణిక్యాలరావు ఇంట్లో పుట్టిన రోజు వేడుకలు చేశారు. దీనికి మాణిక్యాలరావు అన్న కుమారుడి మిత్రుడు కార్తిక్ వచ్చాడు. పుట్టిన రోజు వేడుకలు ముగిసిన తరువాత మాణిక్యాలరావు, కార్తిక్‌ను బైక్‌పై పోరంకిలో దించటానికి బయలుదేరారు. వారు పోరంకి సెంటర్ వద్దకు రాగా వెనుక నుంచి వచ్చిన లారీ వారి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ పై ఉన్న ఇద్దరు రోడ్డుపై పడటంతో గాయాలయ్యాయి. బాధితులను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

నెట్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపికైన బాపులపాడు విద్యార్థి



హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడురోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి షేక్ హనీఫ్ ఉమ్మడి కృష్ణాజిల్లా అండర్–19 నెట్‌బాల్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. విజయవాడలోని సెయింట్ మేరీస్ స్టెల్లా కాలేజీలో బుధవారం జరిగిన ఎంపికలలో షేక్ హనీఫ్ ఉత్తమ ప్రతిభ చాటి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు తెలిపారు. త్వరలో జరగబోయే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో అండర్–19 నెట్‌బాల్ జిల్లా జట్టుకు హనీఫ్ ప్రాతినిధ్యం వహించనున్నట్లు వివరించారు. ఫిజికల్ డైరెక్టర్ పామర్తి వెంకటేశ్వరరావు, క్రీడాకారుడు హనీఫ్‌ను ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

జగనన్న సురక్షతో ప్రజల చెంతకు వైద్య సేవలు



పెద అవుటపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



పెద అవుటపల్లిలో జగనన్న సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీమోహన్



గంగూరులో వైద్య శిబిరాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారి గీతాబాయి



ముదునూరులో మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నాగలక్ష్మి, వైస్ ఎంపీపీ స్వర్ణకుమారి



ముస్తాబాదలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ అందజేస్తున్న ఎంపీపీ అనగాని రవి, అధికారులు

ఉంగుటూరు: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. పెద అవుటపల్లి జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి సంక్షేమం, విద్య, వైద్యం ఉచితంగా అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమాన్ని సంపూర్ణస్థాయిలో అందించలేకపోయాననే లోటు ఉండేదని అన్నారు. గతంలో ఎన్ఏ పేట గ్రామంలోని వారు పింఛను పొందాలంటే పక్క గ్రామమైన ఆత్కూరు వచ్చి తీసుకునేవారని గుర్తు చేశారు. నేడు వైఎస్సార్ ప్రభుత్వం, సచివాలయం, వలంటీరు వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే సంక్షేమాన్ని అందజేస్తుందన్నారు. నాడు నేడు ద్వారా పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీలు సుందరంగా రూపుదిద్దుకున్నాయని చెప్పారు. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉండి అందరికీ సంపూర్ణస్థాయిలో సంక్షేమం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అన్ని విభాగాల వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి ఉచితంగా ప్రభుత్వమే శస్త్రచికిత్సను చేయించి సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి పంపుతారని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగించుకోవాలని సూచించారు. అన్ని విధాలుగా ప్రజలకు మేలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అందరూ ఆశీర్వదించి మరొకసారి సీఎంగా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుడివాడ ఆర్డీవో పద్మావతి, ఎంపీపీ వి.సరోజిని, వైస్‌ఎంపీపీ–2 చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ తిరుపతమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, డాక్టర్లు కరిముల్లా, జితేంద్రకుమార్, అఖిల్‌తేజ, సుగుణావతి, మల్లికార్జునరావు, ఎంపీడీవో శేషగిరిరావు, తహసీల్దార్ వనజాక్షి, ఎంపీటీసీ విజయకుమారి, గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మాదు సాంబశివరావు, వీరంకి వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షే శ్రీరామరక్ష

ఉయ్యూరు: జగనన్న ఆరోగ్య సురక్షే శ్రీరామరక్ష అని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని ముదునూరు గ్రామంలో జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక శిబిరం బుధవారం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ మొవ్వా వెంకట నాగలక్ష్మి, వైస్ ఎంపీపీ గంజి వెంకట స్వర్ణకుమారి ప్రారంభించారు. అనంతరం వైద్య సేవలను పరిశీలించి రోగులకు మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ స్టాళ్లను పరిశీలించి పౌష్టికాహార ప్రాధాన్యం అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు దాసే రవి, పీఏసీఎస్ చైర్మన్ పాలడుగు సత్యనారాయణ, ఎంపీడీఓ విమాదేవి, తహసీల్దార్ మస్తాన్, వైద్యులు శాంతి శివరామకృష్ణ, డాక్టర్ దీప తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ వైద్య సేవలు

పెనమలూరు: జగనన్న ఆరోగ్య సురక్షలో ప్రజలకు సంపూర్ణ వైద్య సేవలు అందిస్తున్నామని జిల్లా వైద్యాధికారి గీతాబాయి అన్నారు. గంగూరు 2వ సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పేదవాడి ఆరోగ్యం పట్ల ప్రభుత్వం భరోసా కల్పించే విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అమలు చేస్తున్నామన్నారు. వైద్య సిబ్బంది సహకారంతో ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రధానంగా బీపీ, షుగర్, రక్తహీనత తదితర వైద్య పరీక్షలు చేస్తున్నామని వివరించారు. వైద్య సిబ్బంది కూడా వైద్య శిబిరానికి వచ్చే రోగులను జాగ్రత్తగా వైద్య పరీక్షలు చేయాలని అన్నారు. ఎంపీడీఓ సునీతాశర్మ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష మండల పరిధిలో అన్ని గ్రామాల్లో సమర్థంగా నిర్వహిస్తున్నామన్నారు. గంగూరులో దాదాపు 500 మందికి ఉచిత వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశామని తెలిపారు. వృద్ధులకు కంటి పరీక్షలు చేసి కళ్లజోడు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎ.శ్రీనివాసరావు, తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నేతలు అక్బర్‌పాషా, ఏఎంసీ డైరెక్టర్ చిట్టూరి సుబ్బారావు, వార్డు సభ్యులు అబ్దుల్‌గని, అన్సర్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ నాణ్యమైన వైద్యం సీఎం సంకల్పం

గన్నవరంరూరల్: ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించాలన్న సంకల్పం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని ఎంపీపీ అనగాని రవి అన్నారు. మండలంలోని ముస్తాబాద జెడ్పీహైస్కూల్‌లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. సర్పంచ్ వి.రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ రవి మాట్లాడుతూ ప్రతి గ్రామానికి వైద్యం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఇప్పటికే రెండు సార్లు ఇంటింటికీ వలంటీర్‌లు, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు సర్వేలు చేసి ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించారని వివరించారు. ప్రజారోగ్యంపై ఇంత చిత్తశుద్ధితో పని చేసిన ప్రభుత్వాలు గతంలో లేవన్నారు. దేశంలోనే ఆదర్శంగా పాలన చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని కోరారు. వైద్య శిబిరంలో 639 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీడీవో ఇ.సత్యకుమార్, జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, ఎంపీటీసీలు గూటాల భాగ్యరాజ్, షేక్ మున్ని, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, మండల సచివాలయాల కన్వీనర్ కైలే శివకుమార్, సచివాలయ కన్వీనర్‌లు, పార్టీ నాయకులు మేచినేని బాబు, బొమ్మారెడ్డి వెంకట నరసింహారెడ్డి, కనగాల ప్రసాద్, హెచ్‌ఎం ఎంవీ సుబ్బారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



ఈడుపుగల్లులో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: మెరుగైన ప్రజారోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు–1 సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ సుందర్‌కుమార్, డాక్టర్ సుధా ప్రసూజ, తదితరులు రోగులకు వైద్య సేవలు అందించారు. 531 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి వైద్య శిబిరాన్ని సందర్శించి రోగులతో మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా గ్రామాల్లోకి నిపుణులైన వైద్యులను పంపించి వైద్యసేవలు అందిస్తున్న ప్రభుత్వం సీఎం జగనన్న ప్రభుత్వమన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, ఎంపీటీసీ బూరగ బాలాజీ, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, అగ్రిబోర్డు డైరెక్టర్ నకరికంటి శేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు నెరుసు సతీష్, ఎస్.బాలకృష్ణ, కె.రాధాకృష్ణ, వణుకూరు ఉపసర్పంచ్ గద్దల రాజా, బిళ్లా వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, ఎంపీడీఓ పి.అనూష పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న విద్యుత్ శాఖ గుణదల ఈఈ పి.హరిబాబు

కంకిపాడు: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని విద్యుత్ శాఖ గుణదల ఈఈ పి.హరిబాబు స్పష్టంచేశారు. కంకిపాడు సెక్షన్ పరిధిలో బుధవారం విద్యుత్ సర్వీసుల విస్తృత తనిఖీ చేపట్టారు. మండల వ్యాప్తంగా 39 ప్రత్యేక బృందాలు విస్తృతంగా పర్యటించి, 2569 సర్వీసులను తనిఖీ చేయగా 106 సర్వీసులు అదనపు విద్యుత్ వినియోగం చేస్తున్నట్లు నిర్ధారించారు. ఈ మేరకు వారికి రూ.3.34 లక్షలు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ విద్యుత్ లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఆటంకాలు లేకుండా సమర్థంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. బిల్లులు పెండింగ్ లేకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. తనిఖీలలో ఈఈ (డీపీఈ) కె.కమలకుమారి, ఈఈ (డీపీఈ) బి.నవీన్‌కుమార్, డీఈఈ ఎం.పూర్ణచంద్రరావు, గుణదల డివిజన్ పరిధిలోని ఏఈఈలు పాల్గొన్నారు. ఏఈ తాళ్లూరి అశోక్ కుమార్ తనిఖీలను పర్యవేక్షించారు.

ధనేకుల కళాశాలలో డ్రోన్ బూట్ క్యాంప్



గంగూరు ధనేకుల కళాశాలలో డ్రోన్‌పై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు డ్రోన్ బూట్ క్యాంప్ నిర్వహిస్తున్నామని ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ ఇజ్రాయెల్ డ్రోన్ రీసెర్చ్ సెంటర్, బెంగళూరు స్పేస్ చేస్ సహకారంతో శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. కాలేజీలో 123 మంది విద్యార్థులు డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో డీన్ సత్యప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ యనమలకుదురులో అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామం లాకుల సెంటర్‌లో శ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి యూవీ ప్రసాదరావు తెలిపారు. ఆయన బుధవారం దసరా ఉత్సవాల వివరాలు వెల్లడించారు. ఆలయంలో దసరా ఉత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు ఉదయం 7 గంటలకు అమ్మవారికి అష్టోత్తర సహిత ఖడ్గమాల పూజ, పంచహారతులు ఇస్తామని తెలిపారు.

■ పారిశుద్ధ్య కార్మికుల నిరసన

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న 8 మందిని విధుల నుంచి తాత్కాలికంగా తొలగించినందుకు వారు పంచాయతీ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన దీక్ష చేపట్టారు. గ్రామ పంచాయతీలో మొత్తం 22 మంది పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తుండగా వారిలో 8 మంది కార్మికులకు వేతనాలు చెల్లించలేమని తాత్కాలికంగా నిలిపివేశారు. సర్పంచి గండికోట సీతయ్య కక్ష సాధింపుగా తమను విధుల నుంచి తొలగించారని కార్మికులు ఆరోపిస్తూ దీక్ష చేపట్టారు. ఈ విషయమై సర్పంచి గండికోట సీతయ్య మాట్లాడుతూ ఇప్పటికే మూడు నెలల వేతనాలు బకాయిలున్నాయని, గ్రామ పంచాయతీకి ఆదాయ వనరులు తగ్గిపోవడంతో తాత్కాలికంగా 8 మందిని నిలిపివేసిన మాట వాస్తవమేనన్నారు. ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శి చెన్నకేశవరావు ఈ విషయాన్ని స్థానిక ఎంపీడీఓ బి.భార్గవి, ఈఓఆర్డీ బీఎల్‌వీ శేషగిరిరావుకు తెలియజేశారు.

■ నేడు నెప్పల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

కంకిపాడు: మండలంలోని నెప్పల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఈనెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. నిపుణులైన వైద్యులు రోగులకు వైద్య సేవలు అందిస్తారని, ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

■ సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో సీజనల్ వ్యాధులు తలెత్తకుండా సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. గ్రామంలో జరుగుతున్న రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో 17 మోటారు బోర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మరమ్మతులకు గురైన బోర్లను గుర్తించి వెంటనే మరమ్మతు చేయిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మాణమవుతున్న వాటర్ ట్యాంకు పనులు 80 శాతం పూర్తి కావచ్చాయన్నారు. ఈ ట్యాంకులకు పైప్ లైన్‌ను విస్తరణ చేసి గ్రామంలో తాగునీటి సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. పారిశుద్ధ్య నిర్వహణపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు.

■ బండారుపై కఠిన చర్యలు తీసుకోవాలి

గన్నవరం: రాష్ట్ర మంత్రి ఆర్కే రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మంత్రి రోజా విషయంలో సభ్య సమాజం సిగ్గుపడే విధంగా బండారు వ్యాఖ్యలు ఉన్నాయని తెలిపారు. మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన బండారుకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

■ మైక్రోసాఫ్ట్ పవర్ బీఐ టెక్నాలజీతో ఉద్యోగావకాశాలు

రామవరప్పాడు: అభివృద్ధి చెందుతున్న మైక్రోసాఫ్ట్ పవర్ బీఐ టెక్నాలజీతో ఎంఎన్‌సీ కంపెనీల్లో ఉన్నత ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని, ఈ టెక్నాలజీపై విద్యార్థులు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న 'మైక్రోసాఫ్ట్ పవర్ బీఐ'పై శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సమన్వయకర్త చైతన్య, డేటాసైన్స్ విభాగాధిపతి ఆశాలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ అంతర్గత రహదారుల అభివృద్ధికి చర్యలు

కంకిపాడు: అంతర్గత రహదారుల అభివృద్ధితో గ్రామాభివృద్ధి జరుగుతుందని వైస్ ఎంపీపీ ధూళిపూడి కృష్ణకిషోర్, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి అన్నారు. కంకిపాడు పట్టణంలోని ఏడో వార్డులో రూ.5 లక్షలతో చేపట్టిన మూడు సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ అనంతరం వారు మాట్లాడుతూ పంచాయతీ సాధారణ నిధులతో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు గాదంశెట్టి ఇంద్రాణి, ఏఎంసీ డైరెక్టర్ మరియబాబు, నాయకులు గాదంశెట్టి పరమేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

■ ఉప్పలూరులో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం

కంకిపాడు: గుర్తుతెలియని వ్యక్తులు వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన మండలంలోని ఉప్పలూరు గ్రామంలో బుధవారం వెలుగు చూసింది. గ్రామ కూడలిలో వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఓదార్పు యాత్ర సమయంలో ఆవిష్కరించారు. మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రాయితో విగ్రహం చెయ్యి భాగాన్ని ధ్వంసం చేశారు. రాయిని కూడా అదే ప్రాంతంలో పడేసి పరారైనట్లు తెలుస్తోంది. బుధవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన గ్రామ నాయకులు నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కంకిపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

■ వలంటీర్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఇటీవల విద్యుదాఘాతానికి గురై మరణించిన బాపులపాడు మండలం కొత్తపల్లికి చెందిన వలంటీర్ రామిశెట్టి దుర్గాప్రసాద్ కుటుంబాన్ని బుధవారం గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పరామర్శించారు. దుర్గా ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వలంటీర్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని ఎమ్మెల్యే వంశీమోహన్ భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

■ బొమ్ములూరు విద్యార్థినికి పీఎంవో ప్రశంసాపత్రం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం బొమ్ములూరు సర్పంచ్ కాటూరు విజయభాస్కర్ కుమార్తె శాన్వికి ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ప్రశంసాపత్రం అందింది. ఇటీవల కేంద్రప్రభుత్వం నిర్వహించిన 'పరీక్షా పే చర్చ' అంశంపై చర్చలో పాల్గొన్న కాటూరు శాన్విని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందిస్తూ ఈ లేఖను పంపారు. ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న శాన్వికి పీఎంవో నుంచి ప్రశంసాపత్రం రావటంపై ఆమెతో పాటు సర్పంచ్ కాటూరు విజయభాస్కర్‌ను పలువురు అభినందించారు.

■ బాలికల అభివృద్ధే దేశాభివృద్ధి

రామవరప్పాడు: బాలికలు ప్రతి అంశంలో అవగాహన పెంపొందించుకుని అభివృద్ధి సాధిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకుని బుధవారం నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టెల్లా కళాశాల, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ దిశ యాప్ భద్రత ఎలా ఉపయోగపడుతుందో బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులతో మానవహారం, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో దిశ సీఐ వాసవి, పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో ఆర్డినేటర్ అరవ రమేష్, ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

■ ఏపీ హైకోర్టు జడ్జిగా కిరణ్మయి ఎంపికపై ఓగిరాల గ్రామస్తుల హర్షం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం ఓగిరాలకు చెందిన మండవ కిరణ్మయి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జిగా ఎంపిక కావటంపై ఆ గ్రామస్తులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలో కొలీజియం నలుగురు న్యాయవాదులతో కూడిన జాబితాను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జిలుగా సిఫార్సు చేస్తున్నట్లు ప్రకటించటంతో ఓగిరాలలో సంబరాలు జరుపుకొన్నారు. ఓగిరాలకు చెందిన మండవ కిరణ్మయి కుటుంబం గత కొంతకాలంగా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఓగిరాల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు కొండపావులూరి కృష్ణప్రసాద్, మేడికొండ రాయుడు, సోంబాబు, ఆలూరు శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.

సంక్షేమ పాలనలో సీఎం జగన్ ఆదర్శం



ఉయ్యూరు 8వ వార్డులో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: సంక్షేమ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని 8 వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ ప్రభుత్వంపై ప్రజల అభిప్రాయం సేకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాసుపత్రిలో వైద్యసేవలు సరిగ్గా అందటం లేదని, అత్యవసర పరిస్థితిలో ఆక్సిజన్ అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. వెంటనే ఎమ్మెల్యే పార్థసారథి ఆసుపత్రి వైద్యులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 8వ వార్డులో ఫిర్యాదు చేసిన ప్రతి ఇంటికీ వెళ్లి విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తమ పిల్లలను రేషన్ కార్డు నుంచి వేరుచేసి పింఛను మంజూరు చేయించాల్సిందిగా అందిన వినతిపై అధికారులతో చర్చించి చర్యలకు ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు ఎండీ బేగ్, తెనాలి పద్మావతి, రాజులపాటి చిన్ని, డాక్టర్ జంపాన పూర్ణిమ, గుంజా సుధాకర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు విద్యశ్రీ, ఖలీల్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జంపాన కొండలరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొడాలి ప్రదీప్, వల్లూరు కళాధర్, ఊకోటి శ్రీనివాసరావు, మరీదు అర్జునరావు, కొట్టు సుబ్బారావు పాల్గొన్నారు.

ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన

ఉయ్యూరు: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో మండలంలోని కాటూరు జెడ్పీ పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విద్యార్థినులకు ఆరోగ్యం, పరిశుభ్రత అంశంపై అవగాహన కల్పించారు. ప్రముఖ ప్రసూతి వైద్యురాలు సింధు విద్యార్థినులకు ఆరోగ్య జాగ్రత్తలు, పాటించాల్సిన పరిశుభ్రత అంశాలను వివరించారు. రుతుక్రమంపై ప్రత్యేక సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, ప్రతినిధులు నల్లా శ్రీనివాస్, అక్తరున్నీసా, సుకన్య, హరిత పాల్గొన్నారు. లయన్స్ ప్రతినిధులు విద్యార్థినులకు శానిటరీ న్యాప్‌కిన్‌లను అందించారు.

గొడవర్రులో 21 నుంచి జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు

కంకిపాడు: బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ మెమోరియల్ సంయుక్త ఆధ్వర్యంలో గొడవర్రు గ్రామంలో ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్లు చోరగుడి విజయ్, అద్దేపల్లి అశోక్, వరికూటి నాగభూషణం తెలిపారు. గ్రామంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గొడవర్రు గ్రామంలోని కమ్యూనిటీహాలు సెంటరులో దసరా ఉత్సవాల సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి విజేతకు రూ.12 వేలు, రెండో విజేతకు రూ.10 వేలు, మూడో విజేతకు రూ.8 వేలు, నాలుగో విజేతకు రూ.5 వేలు బహుమతి, షీల్డులు అందిస్తామని తెలిపారు. చెడుగుడు క్రీడాకారులు పోటీలను విజయవంతం చేయాలని కోరారు.